29 నుంచి జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి- పలాస

మండలంలోని చిన్నగురుదాస్‌పురంలో ఉగాదిని పురస్కరించుకుని ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఈనెల 29 నుంచి 30వ తేదీ వరకు జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో విజేతలకు మొదటి బహుమతి రూ.15 వేలు, ద్వితీయ బహుమతి రూ.12 వేలు, తృతీయ బహుమతి రూ.పది వేలు, చతుర్ధ బహుమతి రూ.పది వేలు, బెస్ట్ రైడర్ రూ.రెండు వేలు, బెస్ట్ డిఫెండర్ రూ.2 వేలు, బెస్ట్ ఆల్‌రౌండర్ రూ.3 వేలు, షీల్డ్ బహుకరిస్తామని అన్నారు. కబడ్డీ పోటీల్లో పాల్గొని క్రీడాకారులకు ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తామని చెప్పారు. పూర్తి వివరాలకు పి.కృష్ణారావు 7063942370, జనగ ధర్మారావు 9073527344, పి.రమేష్ 9908226194 సెల్ నంబర్లను సంప్రదించాలన్నారు.

ప్రశాంతంగా పది పరీక్షలు

- హాజరు కావాల్సిన విద్యార్థులు 28,189
- పరీక్ష రాసిన వారు 28,071
- 99.58 శాతం హాజరు
- పరీక్షల నిర్వహణలో పలుచోట్ల తలెత్తిన లోపాలు
- పొందూరులో ఉక్కపోతతో విద్యార్థుల అవస్థలు
- పరీక్షా కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్, ఎస్‌పి

జిల్లావ్యాప్తంగా సోమవారం ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. తొలిరోజు ఎక్కడా ఎటువంటి ఘటనలు చేసుకోలేదని అధికారులు వెల్లడించారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్ష నిర్వహించారు. పరీక్షల ఏర్పాట్లలో తలెత్తిన లోపాలతో పలుచోట్ల విద్యార్థులు అవస్థలకు గురయ్యారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎపి రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ సొసైటీ డైరెక్టర్, పరీక్షల జిల్లా పరిశీలకులు మస్తానయ్య, ఆర్‌జెడి విజయభాస్కర్, డిఇఒ ఎస్.తిరుమల చైతన్య పలు పరీక్షా కేంద్రాలను సందర్శించి పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు చర్యలను ఎస్‌పి కె.వి మహేశ్వరరెడ్డి స్వయంగా పరిశీలించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలు చేశారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, పొందూరు, ఆమదాలవలస, టెక్కలి

కవిటి : పరీక్షా కేంద్రం నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు

జిల్లావ్యాప్తంగా 149 కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షలకు 28,189 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 28,071 మంది పరీక్షలు రాశారు. 99.58 శాతం హాజరు నమోదైంది. పరీక్షకు 118 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఓపెన్ స్కూళ్ల విద్యార్థులకూ బుధవారం నుంచే పరీక్షలు ప్రారంభమయ్యాయి. ప్రయివేట్‌గా పరీక్షలు రాసేందుకు 168 మంది దరఖాస్తు చేయగా 69 మంది (41.09 శాతం), ఓపెన్ స్కూల్‌కు సంబంధించి ఎస్ఎస్‌సి పరీక్షలకు 59 మంది దరఖాస్తు చేసుకోగా 50 (84.75 శాతం) మంది హాజరయ్యారు. పరీక్షలకు హాజరవుతున్న వారికి ఉచితంగా ఆర్‌టిసి ప్రయాణం అమలు చేసినా చాలినన్ని బస్సులు లేకపోవడంతో, గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు ఆటోల్లోనే ప్రయాణించారు. సాధారణ రూట్లలో తప్ప ప్రత్యేకించి బస్సులు లేకపోవడంతో విద్యార్థులు ఆటోలు, మ్యాక్సీకేబ్‌లు, ఇతర ప్రయివేట్ వాహనాలను ఆశ్రయించారు.

ఉక్కపోతతో విద్యార్థుల అవస్థలు

పొందూరు, కింతలి, తాడివలస, ఎపి మోడల్‌స్కూళ్లలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్షా కేంద్రాల్లో సరైన ఏర్పాట్లు చేయకపోవడంతో, విద్యార్థులు తీవ్ర ఉక్కపోతతో ఇబ్బంది పడ్డారు. పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల కేంద్రం పదో నంబరు రూమ్‌లో ఫ్యాన్లు లేకపోవడంతో చెమటలు కక్కుతూ విద్యార్థులు పరీక్షలు రాయాల్సి వచ్చింది. మిగిలిన రూమ్‌ల్లో సరిపడా ఫ్యాన్లు లేకపోవడంతో ఇబ్బందులు పడినట్లు విద్యార్థులు వాపోయారు. పరీక్షలు ప్రారంభమైనా అవసరమైన మేరకు ఫ్యాన్లు ఏర్పాటు చేయకపోవడంపై విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడ్డారు. దీనిపై బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పరీక్షా కేంద్రాల్లో సమస్యలను పరిష్కరిస్తామని జిల్లా విద్యాశాఖాధికారి తిరుమల చైతన్య తెలిపారు.

ఒకే పరీక్ష కేంద్రం కేటాయింపుపై అసహనం

ఆమదాలవలసలోని గేటు మున్సిపల్ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో ఎస్‌విఎస్ ప్రైవేట్ పాఠశాలకు చెందిన 46 మందిని ఒకేచోట సెంటర్ ఇవ్వడంపై ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ సొసైటీ డైరెక్టర్, పరీక్షల జిల్లా పరిశీలకులు మస్తానయ్య అసహనం వ్యక్తం చేశారు. ఒకే పాఠశాలకు చెందిన మొత్తం విద్యార్థులకు ఒకే కేంద్రం ఎలా కేటాయించారంటూ పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్‌ను ప్రశ్నించారు. అనంతరం ఫ్లయింగ్ స్క్వాడ్ వాగ్దేవి పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు. పరీక్షలు సక్రమంగా జరిగేలా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. దీనిపై రాష్ట్ర పరీక్షల విభాగానికి పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు.

టెక్కలిలో గందరగోళం

టెక్కలి ప్రభుత్వ ఉన్నత, బాలికోన్నత పాఠశాలల వద్ద సోమవారం నుంచి ప్రారంభమైన పదో తరగతి పరీక్షలకు విద్యార్థులు గందరగోళానికి గురయ్యారు. సాధారణ పదో తరగతి పరీక్షలు, ఓపెన్ స్కూల్ పది పరీక్షలు ఒకే కేంద్రంలో నిర్వహించడంతో విద్యార్థులు కొంతసేపు అయోమయానికి గురయ్యారు. సాధారణ పదో తరగతి పరీక్షలు రాయడానికి వచ్చిన విద్యార్థులు, ఓపెన్ పదో తరగతి పరీక్షా కేంద్రాల వద్దకు వెళ్లి తమ హాల్‌టిక్కెట్ల నంబరు చూసుకున్నారు. అందులో నంబర్లు లేకపోవడంతో ఒకింత ఆందోళనకు గురయ్యారు. ఓపెన్ పదో తరగతి పరీక్షలు రాయడానికి వచ్చిన విద్యార్థులు సాధారణ పదో తరగతి పరీక్షా కేంద్రానికి చేరుకోవడంలో సతమతమయ్యారు.

పరీక్షా కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్, ఎస్‌పి

పదో తరగతి పరీక్షల తీరును పరిశీలించేందుకు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శ్రీకాకుళం నగరంలోని ఎన్‌టిఆర్ మున్సిపల్ హైస్కూల్ పరీక్షా కేంద్రాన్ని సందర్శించారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి చీఫ్ సూపరింటెండెంట్లు, ఇన్విజిలేటర్లకు పలు సూచనలు చేశారు. పదో తరగతి పరీక్షల పరిశీలకులు మస్తానయ్య, బి.విజయభాస్కర్, డిఇఒ తిరుమల చైతన్య పలు పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. పదో తరగతి పరీక్షల బందోబస్తు ఏర్పాట్లను ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి క్షుణ్ణంగా పరిశీలించారు. శ్రీకాకుళం నగరంలోని గీతాంజలి స్కూల్‌తో పాటు పలు పరీక్షా కేంద్రాలను సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, ఎలక్ట్రానిక్ పరికరాలను ఎట్టిపరిస్థితుల్లోనూ అనుమతించవద్దని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉన్నందున విద్యార్థులు మినహా ఇతరులను అనుమతించొద్దని సూచించారు. పరీక్షా కేంద్రాల చుట్టుపక్కల ఉండే జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లను పరీక్షలు ముగిసే వరకు తెరవడానికి వీల్లేదన్నారు. ప్రశ్నాపత్రాల భద్రత, పరీక్షా కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రోడ్డు భద్రతా చర్యల ఆంక్షలను జిల్లాలో మరింత కఠినతరం చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యాన జిల్లా రహదారుల భద్రతా సమన్వయ కమిటీ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొద్దిరోజులుగా జాతీయ రహదారిపై పెద్ద సంఖ్యలో ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. ప్రధాన రహదారుల్లో డివైడర్లను బ్రేక్ చేసి వాహన ప్రమాదాలకు అవకాశం కల్పిస్తున్న వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల సమయంలో 108 వాహన సేవలు సకాలంలో అందేలా వైద్యారోగ్యశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అతి వేగం, డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్ లేకుండా వాహనం నడపడం, పరిమితికి మించి ఆటోలో ప్రయాణికులను ఎక్కించుకోవడం, బస్సులు ఇతర వాహనాలలో అధిక లోడుతో సరుకు, ఇతర సామగ్రి రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రవాణా శాఖ అధికారులను ఆదేశించారు.

ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జాతీయ రహదారిపై బ్లాక్ స్పాట్‌ల్లో చోటుచేసుకుంటున్నా, హైవే అధికారులు జాగ్రత్తలు తీసుకోవడంలో విఫలమవుతున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. హిట్ అండ్ రన్ కేసుల్లో బాధితులకు త్వరిత గతిన పరిహారం అందడం లేదని, బాధితులకు త్వరగా పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.

మత్తు పదార్థాల నియంత్రణపై సమీక్ష

జిల్లాలో మత్తు పదార్థాల వినియోగం, విక్రయాలు, రవాణాను అరికట్టేందుకు చిత్తశుద్ధితో పనిచేయాలని కలెక్టర్ అన్నారు. జిల్లా స్థాయి నార్కోటిక్స్ కంట్రోల్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాల రవాణాను అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. జిల్లాలో మత్తు పదార్థాల నివారణ, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా నిరోధంపై తీసుకుంటున్న చర్యలను ఎస్‌పి మహేశ్వర్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో డిటిసి విజయసారథి, డిఎస్‌పిలు వివేకానంద, మూర్తి, వెంకట అప్పారావు, డిపిఒ భారతీ సౌజన్య, ఆర్‌అండ్‌బి ఎస్ఇ జాన్ సుధాకర్, నేషనల్ హైవేస్ అథారిటీ పీడీ తివారీ తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా నిరోధానికి విస్తృత ప్రచారం

నాటుసారా రహిత సమాజం పోస్టర్ ఆవిష్కరణతో పాటు ప్రచార రథాన్ని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ప్రారంభించారు. నాటుసారా దుష్పరిణామాల గురించి ప్రజలకు అవగాహన కల్పించి తయారీ, రవాణా, విక్రయాలను అరికట్టాలని సూచించారు. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ, నాటుసారాపై సమాచారం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 14405 ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ పి.రామచంద్రరావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సిహెచ్.తిరుపతి నాయుడు పాల్గొన్నారు.

'పి-4' సర్వే పరిశీలన

'స్వర్ణాంధ్ర-2047' కార్యాచరణలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన 'పి-4' (ప్రభుత్వం, దాతలు, ప్రజల భాగస్వామ్యం) విధానంపై సర్వే తీరును కొత్తపేట, బాదుర్లపేటలో కలెక్టర్ సోమవారం పరిశీలించారు. పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించడమే 'పి-4' విధానం ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రజలు తమ విలువైన అభిప్రాయాలను swarnandhra.ap.gov.in/p4 వెబ్‌సైట్‌లో తెలియజేయాలని కోరారు.

వేలిముద్రలను పరిశీలిస్తున్న క్లూస్ టీమ్

పలాసలో చోరీ

12 తులాల బంగారం, 30 తులాల వెండి, రూ.లక్ష నగదు అపహరణ

ప్రజాశక్తి - పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని కాశీబుగ్గ గాంధీనగర్ వివేకానంద కాలనీలో నివాసం ఉంటున్న మెట్ట సుదర్శనరావు ఇంట్లో ఆదివారం రాత్రి భారీ చోరీ జరిగింది. ఈ చోరీలో 12 తులల బంగారం, 30 తులాల వెండి, రూ.లక్ష నగదు అపహరించారు. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సుదర్శనరావు తన భార్య భానుమతితో కలిసి ఈ నెల 8న దైవక్షేత్రాలకు దర్శించుకునేందుకు వెళ్లారు. సోమవారం మధ్యాహ్నం తిరిగి ఇంటికి వచ్చే సరికి ఇంటి తాళాలను పగలగొట్టి ఉండడాన్ని పరిశీలించారు. వెంటనే ఇంట్లోకి వెళ్లి చూడగా... బీరువా తలుపులు తెరిచి ఉన్నాయి. దుస్తులు, ఇంటి సామగ్రి చిందరవందరగా పడి ఉండడాన్ని గుర్తించారు. బీరువాలోని బంగారం, వెండి, నగదును చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందజేశారు. ఈ మేరకు శ్రీకాకుళం క్లూస్ టీమ్ వేలిముద్రలను పరిశీలించింది. కాశీబుగ్గ సిఐ సూర్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ఇటీవల పలాస-కాశీబుగ్గలో వరుస దొంగతనాలు చోటు చేసుకోవడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. చోరీకి పాల్పడుతున్న వక్తులు, ఒంటరి ఇళ్లు, ఒంటిరి మహిళలు, తాళాలు ఇళ్లను లక్ష్యం చేస్తూ చోరీలకు పాల్పడుతున్నారు. ఇటీవల కాశీబుగ్గ మారుతీనగర్, శివాజీనగర్ వంటి పలు ప్రాంతాల్లో చోరీలు జరిగాయి. పోలీసులు అప్రమత్తం కాకపోవడ, క్రైం పార్టీ పర్యవేక్షణ లేకపోవడంతో దొంగలు ఇష్టారాజ్యం మారిందని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు.

తుమ్మావీధిలో ప్రజా చైతన్య యాత్ర

సమస్యలు ఏకరవు పెట్టిన స్థానికులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రజాచైతన్య యాత్రలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న సిపిఎం నాయకులు

నగరంలోని తుమ్మావీధిలో సిపిఎం ఆధ్వర్యాన సోమవారం నిర్వహించిన ప్రజా చైతన్య యాత్రలో స్థానికులు సమస్యలను ఏకరువు పెట్టారు. శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలో ఉన్నా, ఈ ప్రాంతంలో అనేక సమస్యలతో సతమతమవుతున్నామని చెప్పారు. విద్యుత్ లోఓల్టేజీ సమస్య ఉందని ఫ్యాన్లు కూడా తిరగడం లేదని సిపిఎం నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. మెహర్‌బాబా ఎలిమెంటరీ స్కూల్ పైకప్పు పెచ్చులు ఊడి పడడంవల్ల విద్యార్థులు చదువుకోవడానికే భయపడుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు వివరించారు. పురాతన భవనాన్ని తొలగించిన అదే స్థలంలో కొత్తగా స్కూలు భవనాన్ని నిర్మించేలా కృషి చేయాలని కోరారు.

మురుగునీటి కాలువల్లో పూడికలు తొలగించకపోవడంతో ఎక్కడికక్కడ లైనింగ్ తెగిపోయి రోడ్ల పైకి మురుగునీరు వచ్చి చేరుతోందని, మరమ్మతులు చేపట్టాలన్నారు. కరెంటు బిల్లులు భారీ మొత్తాలతో వస్తున్నాయని, చాలీచాలని ఆదాయాలతో బిల్లులు కట్టడం భారంగా ఉందని వాపోయారు. వృద్ధాప్య, ఒంటి మహిళ పెన్షన్లు అందేలా కృషి చేయాలని కోరారు. యాత్రలో సిపిఎం నాయకులు కె.శ్రీనివాసు, పి.సుధాకరరావు, ఆర్.ప్రకాశరావు, ఎం.గోవర్ధనరావు, కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

25న కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశకి - కొత్తూరు

గిరిజనుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 25న కలెక్టరేట్ వద్ద ధర్నా చేపడుతున్నట్లు ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మక అప్పన్న తెలిపారు. ధర్నాకు పెద్దసంఖ్యలో గిరిజనులు హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మండలంలోని గొట్టిపల్లిలో సోమవారం నిర్వహించిన ర్యాలీలో ఆయన మాట్లాడారు. ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన ఇటీవల చేసిన సమగ్ర సర్వే గిరిజన గ్రామాల్లో అనేక సమస్యలు వెలుగు చూశాయన్నారు. అనేక గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు లేవని చెప్పారు. గిరిజనుల భూములకు రక్షణ కరువైందన్నారు. అనేక గ్రామాల్లో సామాజిక భవనాలు గానీ, అంగన్వాడీ కేంద్రాలు గానీ లేవన్నారు. సాగునీరు, తాగునీరు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భూ ఆక్రమణలు అధికంగా ఉన్నాయన్నారు. గిరిజనుల భూములు గిరిజనేతరులు ఆక్రమిస్తూ, అడ్డుకున్న గిరిజనులపై దాడి చేస్తున్నారని చెప్పారు. పోలీసులు తిరిగి గిరిజనుల పైనే కేసులు పెడుతున్నారని తెలిపారు. ఐటిడిఎ లేక గిరిజన గ్రామాలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం గిరిజన గ్రామాలను అభివృద్ధి చేసేందుకు తక్షణమే చర్యలు చేపట్టాలని, లేకుంటే గిరిజనులందరూ పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు సవర ధర్మా రావు, శివ, దుర్గారావు, రామారావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న గిరిజనులు

బాలల హక్కులపై ప్రత్యేక దృష్టి

రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కె.అప్పారావు

పలాస: బాలల పరిరక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కె.అప్పారావు అన్నారు. బాలసదనం, అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు. మండలంలోని రంగోయి, పెంటిభద్ర అంగన్వాడీ కేంద్రాలను సోమవారం పరిశీలించి భవనాల మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు, పెంటిభద్ర అంగన్వాడీ భవనం ఎదురుగా పాడుబడిన బావిని కప్పివేయాలన్నారు. అంగన్వాడీ, బాలసదనాల్లో మధ్యాహ్న భోజన పథకాలను పరిశీలించి మెనూ, ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. బాలలు, బాలింతలు, గర్భిణులతో స్వయంగా మాట్లాడి ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు అందుతుందో, లేదో అడిగి తెలుసుకొని ఎక్కడైనా లోటుపాట్లు ఉంటే తమకు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో బాలల సంక్షేమ సమితి చైర్మన్ లక్ష్మి, బాలల రక్షణ అధికారి మెట్ట మల్లేశ్వరరావు, ఎన్.నీరజ, డి.సీతారాములు, ఎంఇఒ-2 సత్యం, సూపర్‌వైజర్లు సరస్వతి, గంగమ్మ పాల్గొన్నారు.

చిన్నారులతో మాట్లాడుతున్న అప్పారావు

నేటి నుంచి ప్రభుత్వ ఉద్యోగులకు కంప్యూటర్ శిక్షణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు ఈనెల 18 నుంచి 22వ తేదీ వరకు కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. ప్రతి శాఖ నుంచి ఇద్దరు, ముగ్గురికి ఈ శిక్షణ ఉంటుందన్నారు. జెడ్‌పి సమావేశ మందిరంలో పలు శాఖల అధికారులతో సోమవారం మాట్లాడారు. శాఖల వారీగా శిక్షణకు హాజరయ్యే ఉద్యోగుల వివరాలు అందజేయాలని సూచించారు. కంప్యూటర్ శిక్షణలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, పవర్ పాయింట్ ప్రజెంటేషన్, ఎక్సెల్ షీట్స్, అడ్వాన్స్ టూల్స్‌పై శిక్షణ ఉంటుందని వివరించారు. 18, 19 తేదీల్లో కలెక్టరేట్ కార్యాలయ సిబ్బందికి, జిల్లా కేంద్రంలోని ఆయా శాఖల సిబ్బందికి కలిపి వంద మంది ఉద్యోగులకు జెడ్‌పి సమావేశ మందిరంలో ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు శిక్షణ ఉంటుందని తెలిపారు. ఈనెల 20వ తేదీన టెక్కలి డివిజన్ కేంద్రంలో 40 మందికి, 21న పలాస డివిజన్ కేంద్రంలో 30 మందికి, 22న శ్రీకాకుళం డివిజన్ కేంద్రంలో 30 మంది ఉద్యోగులకు శిక్షణ ఉంటుందన్నారు. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా ఉద్యోగుల నైపుణ్యాభివృద్ధికి ఈ శిక్షణ తోడ్పడుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉద్యోగులకు సూచించారు.

వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

బకాయిలు చెల్లించాలని పెన్షనర్ల వినతి

'మీకోసం'లో 184 వినతులు స్వీకరణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

పెన్షనర్ల బకాయిలను తక్షణమే చెల్లించాలని విశ్రాంత ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం)లో వినతిపత్రం అందజేశారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డిఆర్ఒ వెంకటేశ్వరరావులు ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. జిల్లావ్యాప్తంగా వివిధ సమస్యలతో కూడిన 184 వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఎంప్లాయీస్ అసోషియేషన్ ప్రతినిధులు కె.సోమసుందరరావు, పి.ఎస్.ప్రసాదరావు, విశ్రాంత ఎంప్లాయీస్ జెఎసి చైర్మన్ చౌదరి పురుషోత్తంనాయుడు పెన్షనర్లు పడుతున్న ఇబ్బందులను కలెక్టర్‌కు వివరించారు. వాటిని వెంటనే ప్రభుత్వం చెల్లించేలా తోడ్పాటు అందించాలని కోరారు. అలాగే పెన్షనర్లకు, అడిషనల్ క్వాంటం 70 ఏళ్లు పూర్తయిన వారికి 10 శాతం, 75 ఏళ్లు పైబడ్డ వారికి 15 శాతం పాత పద్ధతినే పునరుద్ధరించాలని కోరారు. ఇహెచ్‌ఎస్ స్కీమ్ ద్వారా విశ్రాంత ఉద్యోగులు చికిత్సలు పొందలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. వృద్ధాప్యం, తీవ్ర ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. అందువల్ల ఇహెచ్‌ఎస్ స్కీమ్‌ను పనరుద్ధరించాలని కోరారు. వంశధార ఎడమ కాలువను ఇచ్ఛాపురం వరకు పొడిగించేందుకు ప్రభుత్వం తోడ్పాటు అందించాలని మహేంద్ర రైతు సంఘం ప్రతినిధులు కామేశ్వరరావు, హేమారావు చౌదరి, బాలకృష్ణ కోరారు. ఆమదాలవలస నియోజకవర్గం పరిధిలో వైసిపి కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్నారని, వాటిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని సమన్వయకర్త చింతాడ రవికుమార్ ఫిర్యాదు అందజేశారు. వంశధార నిర్వాసిత గ్రామాల్లో పరిహారం చెల్లించకుండా సాంకేతిక కారణాలను చూపించి నిలుపుదల చేశారని, దీనివల్ల ప్రభుత్వం అందించాల్సిన ప్యాకేజీ పొందలేకపోయామని సంకిలికి చెందిన బెవర షణ్ముఖరావు వినతిపత్రం అందజేశారు. వీటితో పాటు వ్యక్తిగత సమస్యలు, సామాజిక అవసరాలు తీర్చాలని పలువురు వినతులను అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, డిఆర్‌డిఎ పీడీ కిరణ్ కుమార్, జెడ్‌పి సిఇఒ ఎల్.ఎన్.వి.శ్రీధర్‌రాజు, డిఎంహెచ్‌ఒ డాక్టర్ బాలమురళీకృష్ణ, డిసిహెచ్‌ఎస్ డాక్టర్ కళ్యాణ్‌బాబు, ఉద్యానవనశాఖ అధికారి ప్రసాదరావు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, GUJJU LOKESU (old Name), So Late NARASIMHULU, Door No: 1-80, Gudem Village, Tekkali Mandalam, Srikakulam District AP, pin- 532201.

Have change my Name from GUJJU LOKESU (old Name) to **GUJJU LOKESWARA RAO** (New Name) hence forth Iam being called as **GUJJU LOKESWARA RAO** For all purposes.

మహారాజశ్రీ పొందూరు జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
IA 419/2024 in OS 87/2022

Between: పంచిరెడ్డి పైడమ్మ .....వాది
And : శిరవూరి సాంబమూర్తి రాజు, నల్లపురాజు రమాదేవి, నల్లపురాజు జయలక్ష్మి, జంపన శ్రీదేవి, శిరవూరి ఉషారాణి ....ప్రతివాదులు
To
శిరవూరి సాంబమూర్తి రాజు, S/o (లేటు) క్రిష్ణమూర్తి రాజు, డోర్ నెం.1-26, క్రిష్ణంరాజుపేట, గెడ్డకంచరాం గ్రామం, జి.సిగడాం మండలం, శ్రీకాకుళం జిల్లా.
నల్లపురాజు రమాదేవి, D/o (లేటు) క్రిష్ణమూర్తి రాజు
నల్లపురాజు జయలక్ష్మి, D/o (లేటు) క్రిష్ణమూర్తి రాజు
జంపన శ్రీదేవి, D/o (లేటు) క్రిష్ణమూర్తి రాజు
శిరవూరి ఉషారాణి, W/o (లేటు) వెంకటపతి రాజు

పై నెంబరు దావాలో వాది మీపైన డిక్లరేషన్ దావాలో మిమ్ములను ప్రతివాదులుగా చేర్చి దావా దాఖలు చేసినందున మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న ఎడల **తేది 08-04-2025న ఉదయం గం॥ ఉ॥ 10-30 ని॥**లకు పై కోర్టువారి ఎదుట హాజరు అయి మీ ఆక్షేపణలు తెలియపరచుకోవలెను. లేని ఎడల మిమ్ములను ఎక్స్-పార్టీ చేసి మీ పరోక్షమందు వాదికి అవసరమగు ఆర్డరును జారీ చేయడమగునని ఇందుమూలంగా మీకు తెలియజేయడమైనది.

//By Court Order//

వాది తరపున న్యాయవాదులు
పొందూరు
తేది : 18-03-2025
కె. కొండలరావు, సెల్ : 9440531061
యమ్.రాము, సెల్ : 9908924397

మహారాజశ్రీ పొందూరు జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
IA 418/2024 in OS 87/2022

Between: పంచిరెడ్డి పైడమ్మ .....వాది
And : శిరవూరి సాంబమూర్తి రాజు, నల్లపురాజు రమాదేవి, నల్లపురాజు జయలక్ష్మి, జంపన శ్రీదేవి, శిరవూరి ఉషారాణి ....ప్రతివాదులు
To
శిరవూరి సాంబమూర్తి రాజు, S/o (లేటు) క్రిష్ణమూర్తి రాజు, డోర్ నెం.1-26, క్రిష్ణంరాజుపేట, గెడ్డకంచరాం గ్రామం, జి.సిగడాం మండలం, శ్రీకాకుళం జిల్లా.
నల్లపురాజు రమాదేవి, D/o (లేటు) క్రిష్ణమూర్తి రాజు
నల్లపురాజు జయలక్ష్మి, D/o (లేటు) క్రిష్ణమూర్తి రాజు
జంపన శ్రీదేవి, D/o (లేటు) క్రిష్ణమూర్తి రాజు
శిరవూరి ఉషారాణి, W/o (లేటు) వెంకటపతి రాజు

పై నెంబరు దావాలో వాది మీపైన డిక్లరేషన్ దావాలో మిమ్ములను ప్రతివాదులుగా చేర్చి దావా దాఖలు చేసినందున మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న ఎడల **తేది 08-04-2025న ఉదయం గం॥ ఉ॥ 10-30 ని॥**లకు పై కోర్టువారి ఎదుట హాజరు అయి మీ ఆక్షేపణలు తెలియపరచుకోవలెను. లేని ఎడల మిమ్ములను ఎక్స్-పార్టీ చేసి మీ పరోక్షమందు వాదికి అవసరమగు ఆర్డరును జారీ చేయడమగునని ఇందుమూలంగా మీకు తెలియజేయడమైనది.

//By Court Order//

వాది తరపున న్యాయవాదులు
పొందూరు
తేది : 18-03-2025
కె. కొండలరావు, సెల్ : 9440531061
యమ్.రాము, సెల్ : 9908924397

ధర్నా చేస్తున్న నాయకులు

జీడికి మద్దతు ధర ప్రకటించాలి

ప్రజాశక్తి- సోంపేట

జీడి పంటకు ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించాలని మామిడిపల్లి రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. అలాగే గ్రామానికి చెందిన ఉపాధి కూలీలు తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ సోమవారం సచివాలయం వద్ద ధర్నా చేపట్టారు. అనంతరం అధికారులకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ జీడి 80 కేజీల బస్తాకు రూ.16 వేలు మద్దతు ధర ప్రకటించాలని రైతులు కోరారు. వేసవి కాలంలో కూలీలకు వంద రోజులు పని కల్పించాలన్నారు. పనులకు అవసరమైన పనిముట్లు అందించాలన్నారు. కనీస కూలి వచ్చేలా పనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు జుత్తు సింహాచలం, ఉపాధి హామీ కూలీల సంఘం నాయకులు తెప్పల పాపారావు, రైతు సంఘం మాజీ అధ్యక్షులు గొరకల మన్మధరావు, జనసేన నాయకులు గొరకల మోహనరావు, మడియా కోటేశ్వరరావు, పాతిన ముకుందరావు, కర్రి సింహాచలం, తాళపత్ర రామారావు, గొరకల నిర్మల, సైనా అప్పలమ్మ, పాతిన కృష్ణవేణి, కర్రి లత, గొరకల మోహిని తదితరులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న యూనియన్ నాయకులు

ఎన్‌పిఎస్‌ను రద్దు చేయాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఎన్‌పిఎస్ (నేషనల్ పెన్షన్ స్కీం) ను రద్దుచేసి పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని ఈస్ట్‌కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ శ్రీకాకుళం రోడ్డు నౌపడ బ్రాంచ్ ఇన్‌ఛార్జ్ మెట్ట అనిల్ చంద్ర కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం శ్రీకాకుళం రోడ్డు రైల్వేస్టేషన్ ఎడిఇఎన్ కార్యాలయం ముందు ఎస్.దంతేశ్వరరావు, బి.ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌ఎఫ్ఐఆర్ జనరల్ సెక్రెటరీ డాక్టర్ ఎం. రాఘవయ్య ఆదేశానుసారం ఈ నెల 17 నుంచి 21 వరకు ఈస్ట్‌కోస్ట్ రైల్వే నందు ఈస్ట్ కోస్ట్ శ్రామిక్ కాంగ్రెస్ ప్రకటించిన ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ ఆర్.సి.సాహూ, జోనల్ ప్రెసిడెంట్ సంపత్ కుమార్ ఆదేశాల ప్రకారం శ్రీకాకుళం రోడ్ ఎడిఇఎన్ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఎన్‌పిఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని అదే విధంగా కార్మికులకుపై పని ఒత్తిడిని తగ్గించాలని, పదోన్నతులు సకాలంలో కల్పించాలని కోరారు. ధర్నా అనంతరం వినతిపత్రాన్ని డివిజనల్ రైల్వే మేనేజర్‌కు ఎడిఇఎన్ ద్వారా అందజేశారు. కార్యక్రమంలో శ్రీకాకుళం, నౌపడ బ్రాంచ్ కార్యవర్గ సభ్యులు, రైల్వే కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాగేశ్వరరావు

'ఐతమ్' అధ్యాపకులకు శిక్షణ

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాల సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యాన 'పైతాన్ ఫర్ ఇంజినీరింగ్ అప్లికేషన్స్' అనే అంశంపై సోమవారం ఆన్‌లైన్‌లో శిక్షణ నిర్వహిస్తున్నామని డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు కళాశాల ఆవరణలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఈ తరగతులకు నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ టీచర్స్ ట్రైనింగ్ అండ్ రీచెర్చ్ (ఎన్ఐటిటిటిఆర్) చండీఘర్కు చెందిన సివిల్ విభాగం సౌజన్యం చేసిందన్నారు. ఎలక్ట్రోనిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ అకాడమీ ఐఐటి రూర్కీ, టెక్కలి ఐతమ్ సివిల్ విభాగాల సహకారంతో నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ తరగతుల్లో వివిధ యూనివర్సిటీలు, ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన 54 మంది అధ్యాపకులు తమ పేర్లను నమోదు చేసుకున్నారన్నారు. ఇఎఫ్‌పి కన్వీనర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మొదలవలస సురేష్, కో-కన్వీనర్లుగా అసోసియేట్ ప్రొఫెసర్ జి.గౌరీశంకర్రావు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జి.ప్రసన్న కుమార్‌లు వ్యవహరిస్తున్నట్టు పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, సివిల్ హెచ్ఐడి డాక్టర్ పి.దినకర్లు పర్యవేక్షణ చేస్తునట్టు తెలిపారు. శిక్షణలో పాల్గొన్న వారికి పార్టిసిపేషన్ ధ్రువపత్రాలను నిర్వహకులు జారీ చేస్తారని అన్నారు.

గృహ నిర్మాణాలకు అదనపు నిధులు

ప్రజాశక్తి- బూర్జ

లక్ష్మీనారాయణ, ఎఇ

గృహ నిర్మాణ లబ్ధిదారులకు అదనంగా మరికొంత మొత్తాన్ని అందించేందుకు చర్యలు చేపట్టడం జరిగిందని గృహ నిర్మాణశాఖ ఎఇ లక్ష్మీనారాయణ తెలిపారు. గతంలో గృహ నిర్మాణం చేసుకున్న లబ్ధిదారునికి ప్రభుత్వం రూ.రెండు లక్షలు అందజేసిందన్నారు. అయితే పెరుగుతున్న ధరలను దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం గృహ నిర్మాణాన్ని వేగవంతం చేసేందుకు అదనంగా రూ.50 వేలు చొప్పున నిధులను విడుదల చేసిందని ఆయన తెలిపారు. మండలంలో అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో 369 మంది బిసి లబ్ధిదారులకు రూ.50 వేలు చొప్పున రూ.కోటి 74 లక్షల 50 వేలు నిధులు విడుదలయ్యాయన్నారు. అలాగే ఎస్‌సి 59 మంది లబ్ధిదారులకు రూ.50 వేలు చొప్పున రూ.34 లక్షల 50 వేలు వచ్చాయన్నారు. అలాగే ఎస్‌టి 41 మందికి గాను రూ.50 వేలు చొప్పున రూ.30 లక్షల 75 వేలు, ఎస్‌టి పివిటిజి 47 మంది లబ్ధిదారులకు రూ.లక్ష చొప్పున రూ.47 లక్షలు కేటాయించగా మొత్తం 506 మంది లబ్ధిదారులకు నిధులు విడుదలయ్యాయన్నారు. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని కోరారు.

రేపు కొత్తమ్మతల్లి వార్షికోత్సవం

కోటబొమ్మాళి: మండలంలోని చీపుర్లపాడు పంచాయతీ ఊడికలపాడులో ఉన్న కొత్తమ్మతల్లి ఆలయ మొదటి వార్షికోత్సవం ఈ నెల 19న నిర్వహిస్తున్నామని సర్పంచ్ నేతింటి చిన్నమ్మడు, అప్పలస్వామిలు సోమవారం తెలిపారు. వేదపురోహితులు సుసరాపు కృష్ణబాబు ఆధ్వర్యాన కోయి డాన్సలతో అమ్మవారిని ఊరేగిస్తామన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు అన్నదానం చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

సిఐఎస్ఎఫ్ సైకిల్ ర్యాలీ బృందానికి ఘన స్వాగతం

ప్రజాశక్తి- రణస్థలం

సిఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన సైకిల్ ర్యాలీ బృందానికి రణస్థలంలో ఘన స్వాగతం లభించింది. సీనియర్ కమాండెంట్ సతీష్ కుమార్ బాజ్‌పే, డిప్యూటీ కమాండెంట్ వినీత్ కుమార్ ప్రభాకర్ ఆధ్వర్యంలో 80 మంది సభ్యులు ఉదయం 9 గంటలకు రణస్థలం తహశీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. తహశీల్దార్ ఎన్.ప్రసాదరావు ఆధ్వర్యంలో వీరికి ఘనంగా స్వాగతం పలికారు. కుంకుమ దిద్ది, హారతి ఇచ్చి పూలతో సంప్రదాయ బద్ధంగా స్వాగతం పలికారు. సిఐ అవతారం నేతృత్వంలో వీరికి బందోబస్తు ఏర్పాట్లు చేశారు. అల్పాహారం అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు ఎ.కె.సింగ్, అమిత్ కుమార్, ఎ.కె.మహాపాత్రో, శికార్ లోహియా, శ్రీనివాస్ విద్యార్థులకు, యువతకు సిఐఎస్ఎఫ్ విధులను వివరించారు. పశ్చిమబెంగాల్ బకేలి నుంచి ఒక

సిఐఎస్ఎఫ్ బృందానికి స్వాగతం పలుకుతున్న తహశీల్దార్

బృందం, గుజరాత్ లఖపథ్ నుంచి ఒక బృందం సైకిల్ ర్యాలీ ప్రారంభించాయన్నారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన బృందం 9 రాష్ట్రాల్లో 25 రోజుల పాటు పర్యటిస్తుందన్నారు. 100 మంది సభ్యులతో 6553 కిలో మీటర్లు ర్యాలీ చేపట్టి మార్చి 31న కన్యాకుమారిలో ముగిస్తామని తెలిపారు. మాదక ద్రవ్యాల రవాణా, నిషేధం, అక్రమ ఆయుధాల నివారణ, తీవ్రవాదుల చొరబాటు నియంత్రణ, తీరప్రాంత భద్రత, మహిళా సాధికారత కోసం సిఐఎస్ఎఫ్ కృషి చేస్తుందన్నారు. సమృద్ధ్ సంరక్షణ పేరుతో చేపట్టిన సైకిల్ ర్యాలీ ద్వారా తీరప్రాంత ప్రజలలో, దేశ భద్రత సమైక్యతను పెంపొందిస్తూ, మనదేశ, రాష్ట్ర, జిల్లా ప్రజలను భద్రతా సిబ్బందితో మమేకం చేస్తున్నమని తెలిపారు. భారతీయ యువతను దేశ భద్రతలో భాగం చేయడంతో పాటు మన దేశ ఆర్థిక అభివృద్ధి, రక్షణలో మన సైనికుల నిబద్ధత, అకుంఠిత దీక్షను విద్యార్థులు, ప్రజలు ప్రత్యక్షంగా వీక్షించేలా ఏర్పాటు చేసిన వీడియోలు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎస్ఐ ఎస్.చిరంజీవి, ఎఎస్ఐ రమణమూర్తి, కోష్ట సచివాలయ మహిళా పోలీస్ అమ్మాజీ, తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది, స్థానిక టిడిపి నాయకులు, విఆర్ఒలు, విద్యార్థులు పాల్గొన్నారు.

27న సొసైటీ సర్వసభ్య సమావేశం

పోలాకి: ఈ నెల 27న పోలాకి ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు సిఇఒ బంటుపల్లి రాంబాబు తెలిపారు. ఈ మేరకు సొసైటీ కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఉదయం 10 గంటలకు సొసైటీ పర్సన్ ఇన్‌ఛార్జి ఆధ్వర్యాన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి రైతులు, అధికారులు హాజరుకావాలన్నారు.

నేడు జీడి తోట వేలంపాట

పోలాకి: మండలంలోని కోడూరు పంచాయతీ పరిధిలోని జీడి తోట ఫలసాయం పొందేందుకు మంగళవారం వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ జి.రవికుమార్ తెలిపారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. గత మంగళవారం వేలం పాట నిర్వహించి ఇందుకు గాను ప్రభుత్వ పాటగా రూ.1,96,600 ప్రకటించగా, ఆ ధరకు పాడేందుకు ఎవరూ ముందుకు రాలేదన్నారు. దీంతో ఈ నెల 18కి వాయిదా వేసినట్లు తెలిపారు. ఈయనతో పాటు సూపరింటెండెంట్ సూర్యప్రకాష్, ఇఒపిఆర్‌డి పద్మావతి, సీనియర్ అసిస్టెంట్ విజయకుమార్, కోడూరు పంచాయతీ పెద్దలు కరుకోలు రమేష్, గొర్లె యర్రయ్య ఉన్నారు.

విద్యార్థులకు సబ్జా రసం అందిస్తున్న యువత

చలివేంద్రం ప్రారంభం

కవిటి: వేసవి తాపాన్ని దృష్టిలో ఉంచుకుని కవిటి మండలం బొరివంకలో యువత ఆధ్వర్యాన సోమవారం చలివేంద్రం ప్రారంభించారు. అనంతరం పాదచారులకు మజ్జిగ పంపిణీ చేశారు. అలాగే పదో తరగతి విద్యార్థులు పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులకు నిమ్మకాయ సబ్జా రసం అందించారు. బాలాజీపుట్టుగకు చెందిన లోల్ల శివాజీ ఆర్థికసాయంతో ప్రారంభించిన కార్యక్రమాల్లో ఎంపిటిసి మాజీసభ్యుడు బెందాళం విజయకృష్ణ, విశ్రాంత జెఇ భగీరథి దళాయి, మాజీ సర్పంచ్ అంతర్యామి బిసాయి, బల్లెడ జయప్రకాష్, బెందాళం శ్రీపతి, బిమ్మో బిసాయి తదితరులు పాల్గొన్నారు.

శక్తి యాప్‌పై అవగాహన

టెక్కలి: మహిళలకు రక్షణ కల్పించే క్రమంలో ఏర్పాటు చేసిన శక్తి యాప్‌పై అవగాహన పెంచుకోవాలని టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ తెంబూరు గోవిందమ్మ అన్నారు. కళాశాల ఆవరణలో జిల్లా పోలీస్ ఉమెన్ ఎంపవర్‌మెంట్ ఆధ్వర్యాన సోమవారం శక్తి యాప్‌పై అవగాహన కల్పించారు. యాప్ వినియోగంపై ఎస్ఐ వి. బాలకృష్ణ అవగాహన కల్పించి విద్యార్థినులను అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బేపల సతీష్‌కుమార్, పోలీస్ సిబ్బంది బి. ప్రసాదరావు, ఆర్.జ్యోతి, ఎస్.రాజేశ్వరి, ఆర్.కుసుమ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తిలక్

రెండో పంటకు నీరందించాలి

టెక్కలి రూరల్ : కూటమి ప్రభుత్వం నియోజకవర్గంలో రెండో పంటకు నీరు ఇవ్వకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని వైసిపి సమన్వయకర్త పేరాడ తిలక్ అన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికీ రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వలేని పరిస్థితిలో కూటమి ప్రభుత్వం ఉందన్నారు. రెండో పంట వేసుకోమని రైతులకు ఈ నియోజకవర్గం నుంచి ఎన్నికైన వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చెప్పారని, అయితే వేసిన పంట ఎండి పోతున్నా మంత్రి ఏమిచేస్తున్నారని ప్రశ్నించారు. మద్యం ఊరురా ఏరులై పారుతుందని, తాగునీరు మాత్రం ఇవ్వలేక పోతున్నారని విమర్శించారు. సమావేశంలో పిఎసిఎస్ మాజీ అధ్యక్షుడు సత్తారు సత్యం, ఆట్ల రాహుల్, ఉప్పాడ తమ్మయ్య, టెక్కలి పట్టణ అధ్యక్షుడు తమ్మన్నగారి కిరణ్, జయమోహన్ పాల్గొన్నారు.

ఎస్‌బిఐ పెన్షన్‌ను సవరించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియాలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు పెన్షన్ రివిజన్‌లో భాగంగా సవరణ చేయాలని ఎస్‌బిఐ పెన్షనర్ల అసోసియేషన్ అమరావతి సర్కిల్ అధ్యక్షులు కె.రామచంద్రరావు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. నగరంలోని సన్‌రైజ్ హోటల్‌లో అమరావతి సర్కిల్ పరిధిలోని పెన్షనర్ల అసోసియేషన్ నాలుగో సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెన్షనర్ల హక్కుల కోసం నిరంతరాయంగా అసోసియేషన్ పనిచేస్తుందని అన్నారు. వైద్య సదుపాయాలు, ఇన్స్యూరెన్స్ సాధించడంలో ముందున్నామన్నారు. ఎస్‌బిఐ విశ్రాంత ఉద్యోగులకు అత్యధిక పెన్షన్ అందుతుందని, ద్వైపాక్షిక ఉద్యోగ విరమణ ఆధారంగానే పెన్షన్ అందజేస్తున్నారని అన్నారు. ప్రస్తుతం పెన్షన్ సవరణ నిర్వహించాల్సి ఉందన్నారు. డిఎ వర్తింపజేయాలన్నారు. ఈ నెల 27, 28 తేదీల్లో దేశవ్యాపంతంగా చేపట్టనున్న బ్యాంకు ఉద్యోగులు

మాట్లాడుతున్న రామచంద్రరావు

సమ్మెకు సంఘీభావం తెలిపామని అన్నారు. అసోసియేసన్ ప్రధాన కార్యదర్శి పి.ఎస్.వి.ఎస్.శర్మ మాట్లాడుతూ వార్షికోత్సవంలో భాగంగా పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. నగరంలోని శాంత కళ్యాన్ అనురాగ నిలయంలో ఉన్న అనాథ బాలలకు రిఫ్రిజిరేటరు అందజేశామన్నారు. ప్రశాంతి వృద్ధాశ్రమంలో వృద్ధులకు 8 మంచాలను అందజేశారు. సమావేశంలో అసోసియేషన్ నాయకులు డి.జి.ఎస్.సి.హెచ్.వెంకటేశ్వరరావు, సర్కిల్ ఉపాధ్యక్షులు బాపయ్య పంతులు, ఎ.జి.ఎస్. శశి భూషణ్‌రాజు, కోటేశ్వరరావు, వి.ఎస్.పిబ్రహ్మ పాల్గొన్నారు.

పిఎసిఎస్ అక్రమాలపై స్పందించాలి

అసెంబ్లీలో ఎమ్మెల్యే రవికుమార్

ప్రజాశక్తి- ఆమదాలవలస

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

గత వైసిపి పాలనలో రాష్ట్రంలో డిసిసిబి, పిఎసిఎస్ స్థాయిలో అధికా రులు అక్రమాలకు పాల్పడి రైతులకు తీవ్ర అన్యాయం చేసారని, దీనిపై సంబంధిత శాఖ తక్షణమే స్పందించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే కూన రవికుమార్ సోమవారం శాసనసభలో ప్రస్తావించారు. ఎమ్మెల్యేలు అసెంబ్లీలో ప్రస్తావించిన పలు సమస్యలపై సంబంధిత శాఖ అధికారులు, రాష్ట్ర సచివాలయ ఉద్యోగులు ఎమ్మెల్యేలకు సకాలంలో వివరాలను అందించడం లేదన్నారు. దీనిపై వ్యవసాయశాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సభ్యులందరికీ సహకార సంఘ నిధుల దుర్వినియోగంపై వివరాలు ఇవ్వడం జరిగిందని తెలపగా దీనిపై సంతృప్తి చెందిన ఎమ్మెల్యే రవికుమార్ తమకు అందించిన పత్రాల్లో పూర్తిస్థాయి సమాచారం లేదని సభ దృష్టికి తీసుకువచ్చారు. ఆమదాలవలస నియోజకవర్గంలోని బూర్జ పిఎసిఎస్ పరిధిలో సుమారు రూ.12 కోట్లు రైతుల డబ్బులను దోచుకొని సిఇఒ అక్రమాలకు పాల్పడి మరణించడం జరిగిందన్నారు. ప్రస్తుతం పిఎసిఎస్ నుంచి ఎటువంటి రుణాలు ఇవ్వకుండా రైతులకు అధిక మొత్తంలో రుణాలు చేసినట్లు చెల్లింపులు చేయాలని నోటీసులు ఇవ్వడం జరిగిందని రవికుమార్ సభ దృష్టికి తీసుకువచ్చారు. డిప్యూటీ స్పీకర్ రఘురాం కృష్ణంరాజు కలుగజేసుకొని అసెంబ్లీలో ఎమ్మెల్యేలు ప్రశ్నించిన సమస్యలపై సంబంధిత శాఖ రాష్ట్ర సచివాలయ ఉద్యోగులు పూర్తిస్థాయి సమాచారం ఇవ్వాల్సి ఉందని, అందించకపోవడం తప్పిదమని భవిష్యత్‌లో అటువంటి తప్పులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఎస్‌సి వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం

మాట్లాడుతున్న బెంజిమెన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

షెడ్యూల్ కులాల విభజన రాజ్యాంగ విరుద్ధమని ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ రాష్ట్ర గౌరవాధ్యక్షులు బెంజిమెన్ అన్నారు. నగరంలోని అంబేద్కర్ భవనంలో విలేకరుల సమావేశంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌సి వర్గీకరణను అడ్డం పెట్టుకుని పాలకులు లబ్ధి పొందాలని చూస్తున్నారని తెలిపారు. అన్ని రాష్ట్రాల్లోనూ అదే పంథా కొనసాగిస్తున్నారని తెలిపారు. తెలంగాణలో షెడ్యూల్ కులాలను విడదీసి లబ్ధి పొందాలని కాంగ్రెస్, బిజెపి చూస్తోందని ఇది తగదని హెచ్చరించారు. తెలంగాణలో 32 లక్షల మంది మాదిగలు ఉన్నారని వారికి లబ్ధిని చేకూర్చే విధంగా ఈ విభజన జరుగుతోందన్నారు. అందుకే తొమ్మిది శాతం మాదిగలకే కేటాయించారని వివరించారు.

ఇది సుప్రీంకోర్టు తీర్పుకు పూర్తి విరుద్ధమన్నారు. గతంలో తెలంగాణలో మందకృష్ణ మాదిగ ఏవిధంగా చేశారో... ఇక్కడా చంద్రబాబు నాయుడును కలిసి మాదిగలకు లబ్ధి చేకూర్చేలా చేస్తున్నారని విమర్శించారు. పారిశ్రామికీకరణ పేరుతో దళితుల భూములను తీసుకొని సెంటు భూమి కూడా వారికి ప్రభుత్వం ఇవ్వలేదని తెలిపారు. పరిశ్రమల స్థాపన సమయంలో ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీలు ఆచరణలో లేకపోవడంతో ఉపాధి లేక భూమి లేక వేలాది మంది యువత వలసలు వెళ్లే పరిస్థితి ఏర్పడుతోందన్నారు. సమావేశంలో దళిత నాయకులు కె రాజులు, కె తవిటయ్య, డి గోవింద్, కె.అసిరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

టీకాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వైరస్, బ్యాక్టీరియల వల్ల సంక్రమించే వ్యాధులను అడ్డుకట్ట వేసేందుకు పుట్టినరోజు నుంచి క్రమం తప్ప కుండా టీకాలు వేయించాలని ఆయుష్ విభాగం సీనియర్ వైద్యాధికారి డాక్టర్ పి.జగదీష్ సూచించారు. సోమవారం నగరంలోని ఆవని నర్సింగ్ కళాశాలలో నెహ్రూ యువక కేంద్రం, భారత యువజన క్రీడల మంత్రిత్వశాఖల సంయుక్తంగా నిర్వహించిన జాతీయ టీకా దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వ్యాధులను నివారించడంలో టీకాల ప్రాముఖ్యత ఎంతో ఉందన్నారు. డిపిటి, పోలియో, టిటితో పాటు హెపటైటిస్ వంటి వివిధ రకాల టీకాలను చిన్నతనంలో వేసుకుంటే వారికి సంబంధిత రోగాలు దరి చేరకుండా ఉంటాయన్నారు. జాతీయ టీకాల దినోత్సవాన్ని మొదటిసారిగా 1995 మార్చి 16న జరుపుకున్నామన్నారు. పల్స్‌పోలియో ఇమ్యునైజేషన్ ప్రోగ్రామ్ ద్వారా మొదటిసారిగా నోటి ద్వారా తీసుకునే పోలియో టీకాను అందించారని గుర్తు చేశారు. దేశం నుంచి పోలియోను నిర్మూలించాలన్న లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి 2014 నాటికి పోలియో రహిత దేశంగా

మాట్లాడుతున్న డాక్టర్ జగదీష్

ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించే వరకు శ్రమించామన్నారు. అవని స్కూల్ ఆఫ్ నర్సింగ్ పరిపాలన అధికారి బి.సునీత మాట్లాడుతూ టీకా ద్వారా శరీరంలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. రోగకారక కణాలను వృద్ధి చెందకుండా టీకా అడ్డుకుంటుందన్నారు. కార్యక్రమంలో లైఫ్ ఫ్యూయల్ సర్వీస్ ఆర్గనైజేషన్ జాయింట్ సెక్రటరీ ఎస్ సత్యనారాయణ, అవని స్కూల్ ఆఫ్ నర్సింగ్ కమ్యూనిటీ హెల్త్ ఫ్యాకల్టీ పి.విశ్వనాథం, నెహ్రూ యువ కేంద్ర ఎన్.వై.విలు అరుగుల దిలీప్ కుమార్, మట్టా ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

చెక్కులను అందజేస్తున్న స్వాతి

సిఎం సహాయనిధి చెక్కులు అందజేత

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నియోజకవర్గంలో వివిధ అనారోగ్య కారణాలతో ఆసుపత్రుల పాలైన పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థికసాయం మంజూరు చేశారు. గార మండలానికి చెందిన గుడ్ల తారక రామారావు రూ.4 లక్షలు, బనిశెట్టి సత్యారావు రూ.1,18,481, పోరా అప్పారావు రూ.46,666 సాయాన్ని విడుదల చేశారు. ఈ చెక్కులను ఎమ్మెల్యే సతీమణి, టిడిపి నాయకులు గొండు స్వాతి శంకర్ చేతులమీదుగా లబ్ధిదారులకు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో గార టిడిపి నాయకులు గొండు వెంకట రమణమూర్తి, రెడ్డి గిరిజా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

కళింగకోమటి సంఘం మండల కార్యవర్గం ఎన్నిక

టెక్కలి: టెక్కలి కళింగ కోమటి సంఘ మండల, పట్టణ నూతన కార్యవర్గం సోమవారం ఎన్నికైంది. పట్టణ అధ్యక్షునిగా లాడి శ్రీనివాసరావు, మండల అధ్యక్షునిగా జామి రమణయ్య, కార్యదర్శులుగా బెలుసోంటి నగేష్, దుంప గోవిందరావు, సంయుక్త కార్యదర్శులుగా జామి అనిల్ కుమార్, డోకి వేణు, కోశాధికారిగా మోణింగి గోవిందరావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘ ఆదాయ, వ్యయ వివరాలు, సంఘంలో ఉన్న పుస్తకాల ద్వారా సభ్యులు తెలుసుకోవచ్చునని సమావేశం తీర్మానించింది.

సమావేశంలో పాల్గొన్న సభ్యులు

తాడివలస పంచాయతీ సాధారణ సమావేశం

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని తాడివలస పంచాయతీ సాధారణ సమావేశం సోమవారం సర్పంచ్ తమ్మినైన మణెమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ పరిధిలో చేపట్టాల్సిన పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్ బల్బులు వంటి పలు అంశాలపై చర్చించారు. అలాగే ఎన్ఆర్ఇజిఎస్ నిధులతో చేపట్టిన సిసి రహదారులు, కాలువల బిల్లులు చెల్లింపు, గ్రామంలో బస్టాండ్ వద్ద ముఖధ్వారం, గ్రామ స్వర్గధామంనకు వెంకమ్మపేట వద్ద ముఖద్వారం ఏర్పాటు వంటి పలు అంశాలపై చర్చించి తీర్మానం చేశారు. ఎన్ఆర్ఇజిఎస్ రెండవ విడతలో గ్రామంలో పలు పనులకు సుమారు రూ.60 లక్షలు నిధులు మంజూరు జరిగినట్లు సర్పంచ్ మణెమ్మ పేర్కొన్నారు. సమావేశంలో కార్యదర్శి గురుగుబెల్లి రామ్‌రాజీవ్, వార్డు సభ్యులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్ను వసూళ్లు వేగవంతం

ప్రజాశక్తి- పలాస

మార్చి నెలాఖరులోగా పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో ఇంటి పన్ను శతశాతం వసూళ్లు చేపట్టాలని, వంద రోజుల్లో పారిశుధ్య సమస్యలు లేకుండా, ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దాలని మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు సచివాలయం అధికారులను ఆదేశించారు. పలాస మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ, మున్సిపల్ ఉద్యోగులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆస్తి పన్ను వసూళ్లకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాలో మున్సిపాలిటీని నెంబరు వన్‌గా తీసుకురావాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వంద రోజుల్లో మొత్తం పారిశుధ్య సమస్యలన్నీ గాడిలో పెట్టడానికి తగు ప్రణాళికతో ముందడుగు వేయాలన్నారు. ప్లాస్టిక్ నిషేధానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డ్వాక్రా సంఘాలు తయారు చేసే గుడ్డ సంచులను వినియోగించే విధంగా ప్రోత్సాహం అందించాలని కోరారు. ప్రభుత్వ గృహాలు నిర్మించేందుకు ప్రోత్సహించాలన్నారు. సగంలో నిలిచిన గృహాలకు ప్రభుత్వం అదనంగా నిధులు కేటాయించిందన్నారు. ఈ విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఇప్పటి వరకు 68 దరఖాస్తులు మంజూరయ్యాయన్నారు. 235 స్థలం లేనట్టి దరఖాస్తులు ఆన్‌లైన్ రిజిస్టర్ అయ్యిందని తెలిపారు. ఇళ్లు నిర్మించుకునేందుకు ఈ నెల 31 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు.

క్రైమ్ కార్నర్

నిందితుడిని ప్రవేశపెట్టిన డిఎస్‌పి వెంకట అప్పారావు

ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు బానిసై...

పుస్తెలతాడు చోరీ నిందితుడు అరెస్టు

పలాస: ఐటిఐ విద్యార్థి బంగారుబండి ప్రదీప్ ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌లు కట్టి రూ.1.10 లక్షల వరకూ కోల్పోవడంతో దాన్ని రాబట్టుకోవడానికి చైన్‌స్నాచర్‌గా మారాడని డిఎస్‌పి వి.వెంకట అప్పారావు అన్నారు. కాశీబుగ్గ కోసంగిపురం శివాలయం వద్ద వృద్ధురాలి మెడలో పుస్తెలతాడు చోరీ కేసులో నిందితుడిని అరెస్టు చేశామన్నారు. ఈ మేరకు పోలీస్‌స్టేషన్‌లో నిందితుడిని సోమవారం విలేకరుల ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాశీబుగ్గ పోలీసులు ఈ చోరీ కేసును చాకచక్యంగా ఛేదించారని తెలిపారు. ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పురుషోత్తపురానికి 19 ఏళ్ల వయసు ఉన్న ప్రదీప్ విశాఖపట్నం ఐటిఐలో చేరి సగంలో చదువుకు స్వస్తి పలికారని అన్నారు. ఇంటివద్దే ఖాళీగా ఉండడంతో సెల్‌లోని ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటు పడ్డాడని అన్నారు. ఆన్‌లైన్ ఆటలు, బెట్టింగ్‌లు కడుతూ కాలక్షేపం చేస్తుండేవాడని పేర్కొన్నారు. ఈ క్రమంలో బెట్టింగ్‌ల్లో రూ.1.10 లక్షల వరకూ కోల్పోవడంతో ఇంట్లో తెలియకుండా ఆ నగదు తిరిగి ఇచ్చేందుకు తీవ్ర ప్రయత్నం చేశారని అన్నారు. ఎక్కడా డబ్బులు సమకూరకపోవడంతో దొంగతనం చేసి ఆ డబ్బులు సేకరించాలని పథకం రచించాడని అన్నారు. ఈ క్రమంలో ఈ నెల 12 కిడ్నీ ఆస్పత్రి రోడ్డులో కోసంగిపురానికి చెందిన దుంపల యశోధ తన భర్త అప్పన్న కిడ్నీ ఆస్పత్రిలో చికిత్స పొందుతుందన్నారు. ఆస్పత్రి నుంచి తిరిగి స్వగ్రామం వెళ ్ళుండగా ప్రదీప్ ఆమెను తన వాహనంలో స్వగ్రామం చేరుస్తానని మాయమాటలు చెప్పాడని అన్నారు. అనంతరం నిర్జీవ ప్రదేశానికి తీసుకువెళ్లి ఆమె మెడలో బంగారు ఆభరణాలు చోరీ చేసి ఉడాయించాడని తెలిపారు. దొంగిలించిన బంగారాన్ని పలాస రైల్వే కాలనీలో నివాసం ఉంటున్న రుసువా కిరణ్‌కుమార్ ఇచ్చారని, దానిని కాశీబుగ్గ రెల్లివీధికి చెందిన పవర్ రంజిత్‌కు అమ్మకానికి ఇచ్చాని తెలిపారు. రూ.1.77 లక్షలకు ఆభరణాలు అమ్మకం చేపట్టారని అన్నారు. అందులో కిరణ్‌కుమార్‌కు తన వాటాగా రూ.27 వేలు ఇవ్వగా, మిగిలిన రూ.1.50 లక్షలు నగదు ప్రదీప్ తీసుకున్నాడని అన్నారు. వాటాలు సక్రమంగా పంచుకొని ఎవరిదారిన వారు వెళ్లిపోయారని తెలిపారు. ఇదిలా ఉండగా ప్రదీప్ ఆయన వాటాకు వచ్చిన నగదు కూడా మళ్లీ ఆన్‌లైన్ బెట్టింగ్‌లు కట్టి పోగొట్టుకున్నారని పేర్కొన్నారు. పలాసలో ఉంటున్న తన బాబాయ్ అయిన కిరణ్‌కుమార్ వద్దకు రూ.10 వేలు కావాలని ఆదివారం వచ్చాని అన్నారు. బాధిత మహిళ ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు బృందాలుగా ఏర్పడి ఇచ్చాపురం, శ్రీకాకుళం వైపు వెళ్తున్న క్రమంలో ప్రదీప్ తారాసపడ్డాడని అన్నారు. అనుమానంతో ఆయనను తమదైనశైలిలో ప్రశ్నించడంతో చైన్‌స్నాచింగ్ విషయాన్ని వెల్లడించారని తెలిపారు. అరెస్టు చేసి సోమవారం పలాస కోర్టులో హాజరపరిచామన్నారు. కేసును ఛేదించిన పోలీసులకు అభినందనలు తెలిపారు.

'పది' విద్యార్థి అదృశ్యం

విక్రాంత్

కోటబొమ్మాళి: మండలం కోటబొమ్మాళి మేజరు పంచాయతీ పరిధిలోని జగనన్న కాలనీకి చెందిన పదో తరగతి విద్యార్థి సంపతిరావు విక్రాంత్ అదృశ్యమయ్యాడని విద్యార్థి తల్లి దండ్రులు రమేష్, రేవతిలు ఫిర్యాదు చేశారని ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపారు. విక్రాంత్ చదవకపోవడంతో ఆదివారం మధ్యాహ్నం ఇంటి వద్ద తల్లిదండ్రులు చదువు విషయంలో మందలించారని అన్నారు. వెంటనే బయటకు వెళ్లిపోయాడన్నారు. రాత్రైనా ఇంటికి రాకపోవడంతో బంధువుల ఇంట్లో గాలించారని, ఎక్కడ లేకపోవడంతో ఫిర్యాదు చేశారని అన్నారు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

సోంపేట : మండల పరిధిలోని బారువ రైల్వేస్టేషన్ సమీపంలో సోమవారం రైలు ఢీకొని బారువకు నెయ్యిల అశోక్ కుమార్ మృతి చెందాడు. ఈ మేరకు ట్రాక్‌పై పడి ఉన్న మృతదేహాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందజేశారు. పలాస జిఆర్‌పి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

నవధాన్యాల సాగుతో అధిక దిగుబడులు

ఆమదాలవలస : సమావేశంలో మాట్లాడుతున్న డిపిఎం రేవతి

ప్రజాశక్తి- ఆమదాలవలస
రానున్న ఖరీఫ్ సీజన్‌కు ముందు చేయబోయే నవధాన్యాల సాగు పద్ధతితో అధిక దిగుబడులు సాధ్యమని ప్రకృతి వ్యవసాయ డిపిఎం రేవతి అన్నారు. సోమవారం పట్టణంలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయ విభాగంలో భాగంగా వెలుగు సిబ్బంది, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్స్, ప్రకృతి వ్యవసాయ విభాగం సిబ్బందికి సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం ప్రకృతి వ్యవసాయ సిబ్బంది చేయబోతున్న ఖరీఫ్ కార్యాచరణ ప్రణాళికకు క్షేత్రస్థాయిలో గ్రామాల్లో వెలుగు సిబ్బంది, సిఎఫ్‌లు, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు పూర్తి సహాయ సహకారాలు అందించాలని తెలిపారు. రానున్న ఖరీఫ్ సీజన్‌కు ముందు చేయబోయే నవధాన్యాల సాగు పద్ధతిలో చేయాల్సిన విధానాలను సిబ్బందికి వివరించారు. వెలుగు, వ్యవసాయ శాఖ అనుబంధ సంస్థలు సంయుక్తంగా కలిసి క్షేత్రస్థాయిలో ప్రకృతి వ్యవసాయాన్ని మరింత బలోపేతం చేయడానికి ప్రోత్సాహాన్ని ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది శ్రీనివాస్, లక్ష్మీ నాయుడు, మండల ఎఓ మెట్ట మోహనరావు, ఎపిఎం గురుగుబెల్లి నారాయణరావు, మండల మహిళా సమైక్య విఒఎ, ఒబిలు, విఎఎలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తూరు: ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వాలని డివిజన్ వ్యవసాయశాఖ ఎడి రాజగోపాల్, ఇన్‌ఛార్జి ఎన్.ఎఫ్.ఎ.గోవిందరావు అన్నారు. వైస్ ఎంపిపి తులసీవరప్రసాదరావు ఆధ్వర్యాన స్థానిక మండల మండల మహిళా సమాఖ్య వద్ద సోమవారం ప్రకృతి వ్యవసాయపై ఈ ఏడాది కార్యాచరణ ప్రణాళిక సమావేశం సోమవారం నిర్వహించారు. ముందుగా భూమి ఆవశ్యకత గురించి వీడియో వేసి సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపిపి మాట్లాడుతూ రైతులు తమకున్న మొత్తంలో ప్రకృతి వ్యవసాయం దృష్టిసారించాలన్నారు. కార్యక్రమంలో ఎంఎంఎస్ అధ్యక్షులు జయమ్మ, ఎంటి సూర్యనారాయణ, వెలుగు సిసిలు, విఎఎలు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న రైల్వే ఉద్యోగులు

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

ప్రజాశక్తి- పలాస
రైల్వేశాఖలో రద్దు చేసిన పాతపెన్షన్ విధానాన్ని తిరిగి అమలు చేయాలని కోరుతూ గుర్తింపు పొందిన కార్మిక సంఘం శ్రామిక్ కాంగ్రెస్ ఆధ్వర్యాన రైల్వేస్టేషన్ వద్ద సోమవారం ఒక్కరోజు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘ నాయకులు మాట్లాడుతు రైల్వేశాఖలో కొత్త ఉద్యోగాల నియామకం చేపట్టాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ట్రాక్ మెంటేనర్ల సమస్యలు పరిష్కరించాలన్నారు. రన్నింగ్ స్టాఫ్‌కు పన్నుల నుంచి 70 శాతం అలవెన్స్‌లు మినహాయించాలని కోరారు. రైల్లో రెగ్యులర్ ఉద్యోగులను నియమించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రవిచౌదరి, విక్రమారావు, తమ్మినేని హరి, ఆర్.వెంకటరావు పాల్గొన్నారు.

పాపారావును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్ కుమార్

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి- లావేరు
మండలంలోని గుమ్మడాంకు చెందిన వైసిపి నాయకులు యినపకుర్తి పాపారావును ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ సోమవారం పరామర్శించారు. పాపారావు భార్య సూర్యం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆయన పరామర్శించి సంతాపాన్ని తెలిపారు. ఆయన వెంట వైసిపి నాయకులు ముప్పిడి శ్రీరాములు, నాగం కనకరాజు, గుండు లక్ష్మణరావు, శెట్టిపల్లి రాంబాబు తదితరులున్నారు.

మహిళలు స్వయంశక్తితో ఎదగాలి

ప్రజాశక్తి- పొందూరు
చేనేత మహిళలు స్వయంశక్తితో ఎదిగి ఆర్థికాభివృద్ధిని సాధించాలని సిక్కోలు వీవర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ ముఖ్య కార్యనిర్వాహణాధికారి బి.అప్పలనాయుడు అన్నారు. స్థానిక దేవాంగ సంఘ గ్రంథాలయంలో సోమవారం నాబార్డు ఆధ్వర్యంలో ఆర్ట్స్ స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసిన మహిళా దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. తమ సంస్థ చేనేత, రైతు మహిళలకు పెద్దపీట వేస్తూ వారి ప్రగతికి అన్ని విధాల తోడ్పడుతుందని పేర్కొన్నారు. ఆర్ట్స్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ కుప్పిలి పద్మ మాట్లాడుతూ సంస్థ పరిధిలో వివిధ గ్రామాల్లో 515 మంది సభ్యులున్నారన్నారు. బాల్య వివాహాలు వంటి మూఢాచారాలను నిర్మూలించి నవీన సమాజాన్ని ఏర్పాటు చేయగలరన్నారు. ప్రముఖ ఖాదీ, చేనేత పరిశ్రమల విశ్లేషకులు వాండ్రంగి కొండలరావు మాట్లాడుతూ పొందూరు ఖాదీ, చేనేతలు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం వెనుక మహిళల పాత్ర గణనీయంగా ఉందన్నారు. ఈ సందర్భంగా పలువురు చేనేత మహిళా కార్మికులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆర్ట్స్‌సంస్థ సభ్యులు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులను సన్మానిస్తున్న ఆర్ట్స్ సంస్థ సభ్యులు

ఎంపిడిఒకు వినతిపత్రం అందజేస్తున్న భాస్కరరావు

మురుగు సమస్యతో అవస్థలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం రూరల్
మండలంలోని రాగోలు పంచాయతీ శివసాయి కాలనీలో మురుగునీటితో కాలనీవాసులు అవస్థలు పడుతున్నా పంచాయతీ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు బొడిగి భాస్కరరావు విమర్శించారు. ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ శైలజను సోమవారం కలిసి వినతిపత్రం అందించారు. శివసాయి కాలనీలో మురుగునీటి కాలువలకు అవుట్‌లెట్ లేకపోవడంతో రోడ్డుపైనే మురుగునీరు చేరి రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని వివరించారు. స్థానిక శివాలయం పక్కన ప్రభుత్వ స్థలంలో తవ్విన గుంతలో వాడుక, మురుగునీరు నిలిచి దుర్వాసన వస్తోందన్నారు. సెప్టిక్ ట్యాంకు అవుట్‌లెట్‌లను మురుగు కాలువలకు అనుసంధానం చేయడం వల్ల సమస్య మరింత తీవ్రంగా ఉందన్నారు. మురుగునీరు కాలనీ ఆవాసాల మధ్య నిల్వ లేకుండా సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

వినతిపత్రం అందజేస్తున్న పరమేశ్వరరావు

విద్యార్థులకు న్యాయం చేయాలి

టెక్కలి : గ్రూప్-2 పరీక్షల్లో ఏర్పడిన అనిశ్చితిని అర్థం చేసుకుని విద్యార్థులకు న్యాయం చేయాలని జైభారత్ నేషనల్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బైపల్లి పరమేశ్వరరావు కోరారు. ఈ మేరకు టెక్కలి ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తిని సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వుల్లో నెలకున్న సమాంతర రిజర్వేషన్, రోస్టర్ విధానం వల్ల చాలా మంది నిరుద్యోగులు గ్రూప్-2 పరీక్షకు సిద్ధం కాలేకపోయారని అన్నారు. ప్రభుత్వం స్పందించి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు.

ధర్నా చేస్తున్న సిపిఐ నాయకులు

అర్హులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్
కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం జిల్లాలో అర్హులైన పేదలకు గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు ఇళ్ల స్థలం పేదలకు ఇవ్వాలని సిపిఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం జిల్లా పరిషత్ కార్యాలయం ఎదుట సిపిఐ ఆధ్వర్యాన ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి పది నెలలు కావస్తున్నా కూటమి నాయకులు ఇచ్చిన ఎన్నికల హామీలను నెరవేర్చలేదన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తామని నమ్మించి ఇప్పటి వరకు అమలు చేయలేదన్నారు. అర్హులైన పేదలందరికి ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలన్నారు. సొంతింటి కల నెరవేర్చుకునేందుకు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సంతోష్, కొన్న శ్రీనివాసరావు, సిపిఐ నాయకులు అరవింద్, మధు, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న టిడిపి నాయకులు

'సుజల' పునరుద్ధరణకు వినతి

ఇచ్ఛాపురం : మండలంలో సన్యాసిపుట్టుగ, నీలపుపుట్టుగలో ఉన్న ఎన్‌టిఆర్ సుజల పథకాలను పునరుద్ధరణకు చర్యలు చేసుకోవాలని టిడిపి నాయకులు దక్కత కామేశ్వరరావు, లోపింటి పద్మనాభం కోరారు. ఈ మేరకు ఎంపిడిఒ రామారావును సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పథకాలు గత కొంతకాలంగా మరమ్మతులకు నోచుకోక గ్రామంలో తాగునీరుకి ప్రజలు అవస్థలు పడుతున్నారని అన్నారు. అనేకసార్లు అధికారులకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదని వాపోయారు.

మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి- కవిటి
మత్స్యకార సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ సతీమణి నీలోత్పల, జెడ్‌పిటిసి మాజీ సభ్యుడు బెందాళం రమేష్ అన్నారు. స్థానిక టిడిపి నాయకులతో కలిసి మండలంలోని కొత్తపాలెంను సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా మత్స్యకారులతో మమేకమై వారి సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వ పాలన, భవిష్యత్‌లో అమలు చేయనున్న పథకాలు వివరించారు. ఈ సందర్భంగా కొంతమంది మత్స్యకారులు ఉపాధి హామీ పనులు కల్పించాలని, రామాలయానికి రక్షణ గోడ ఏర్పాటు చేయాలని కోరారు. వీటిపై సానుకూలంగా స్పందించిన టిడిపి నాయకులు మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల కార్యదర్శి బెందాళం తిరుమల, ఐటిడిపి రాష్ట్ర కార్యదర్శి పుల్లట రాజు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులతో మాట్లాడుతున్న నీలోత్పల

బెహరా మనో వికాస కేంద్రానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్
వాకర్స్ మాజీ గవర్నర్ గుడ్ల సత్యనారాయణ జన్మదినాన్ని పురస్కరించుకుని నగరంలోని బెహరా మనో వికాస కేంద్రం అభివృద్ధికి రూ.20 వేలు ఆర్థికసాయాన్ని సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా కేంద్రాన్ని సందర్శించి మానసిక వికలాంగుల సమక్షంలో కేక్‌కట్ చేసి వారికి పంచిపెట్టారు. మానసిక వికలాంగులకు అల్పాహారం అందజేశారు. కార్యక్రమంలో కొంక్యాన వేణుగోపాల్, శాసపు జోగినాయుడు, స్టార్‌వాకర్స్ గేదెల ఇందిరాప్రసాద్, గుడ్ల జగ్గారావు, డాక్టర్ ఎం.వాసుదేవ్, గోలీ ఉమా మహేశ్వరరావు, గేదెల లక్ష్మీ, వాసంతి, రామ్ బాయ్, ఎండ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను స్వీకరిస్తున్న ఆర్‌డిఒ కృష్ణమూర్తి

12 అర్జీలు స్వీకరణ

టెక్కలి: అర్జీదారుల సమస్యలు పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి ఆదేశించారు. తన ఛాంబర్‌లో ప్రజా సోమవారం మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 12 అర్జీలను స్వీకరించారు. వీటిలో గృహనిర్మాణ శాఖ మూడు, రెవెన్యూ నాలుగు, డ్వామా, కాలుష్య బోర్డు, సర్వే అండ్ లాండ్ రికార్డ్స్, పంచాయతీరాజ్‌శాఖలకు ఒక్కో ఫిర్యాదులు వచ్చాయి. కార్యక్రమంలో డివిజన్‌స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అల్పాహారం పెడుతున్న వాకర్స్